
# కథావేదిక

ప్రతినెలా వైవిధ్యంగల కథలను అందిస్తూ కథాప్రియులకు వెతుక్కునే పనిలేకుండా కథలన్నీ ఒకేచోట చేర్చి, కత్తిరించి పొందుపరచుకుంటే చక్కని కథల సంకలనంలా మారీ, మంచి కథను మళ్లీ మళ్లీ చదువుకునే చక్కని అవకాశాన్ని పాఠకులకు కలిగించే వినూత్న ప్రక్రియ... ఈ కథావేదిక.

## వాణి Vs వాణి

— పి. కృష్ణకుమారి




కాలింగ్ బెల్ ఆగకుండా గోలెడుతుంటే పరుగున వెళ్లి తలుపు తీసి ఆయాసపడ్డా. వడగాలీ సుడిగాలీ కాంబినేషన్‌లా వచ్చిపడింది సత్యా- సత్యవాణి. ''రా కూచో'' అనేందుకు నాకవకాశ మివ్వకుండా ధడీలని సోఫాలో కూలబడి, ''ఒసేవ్! గుర్తుందా? మన బ్యాచ్‌లోనే ఇంకో వాణి వుండేదీ సౌమ్యవాణీ? అది మీ ఎదురింట్లోనే ఉంటోందేవ్. ఆ ఇల్లు దాన్దేలే'' అంది గుక్క తిప్పుకోకుండా.

''వాట్! సౌమ్యా! ఆ ఇంట్లో వుందా? పద మీటవుదాం'' అన్నా. నా ఆనందానికి హద్దుల్లేవు.

''ఒసి వెర్రి పీనుగా! వెర్రి పీనుగానీ! దాని జోలికెప్పుడూ పోకు. ముట్టుకుంటే అంటుకుంటుంది. నువ్వు మా ఇంటి దగ్గరే ఇల్లు కొనేసి సెటిలైనందుకెంత సంతోషించానో అది ఇప్పుడిక్కడే పెర్మనెంటుగా వుండబోతోందని అంత విచారిస్తున్నా'' అంది.

''ఎందుకే బాధ దానింట్లో అదుంటే?'' కాఫీ కప్పూ, బజ్జీ ప్లేటూ సమర్పించి అడిగా.

''ఏం కాఫీలే బాబూ! తాగి తాగి పైత్యం చేసి చస్తున్నా. పైగా బీపీ ఒకటీ. ఈమధ్య మైగ్రెయిన్ కూడా తగులుకుందిలే. బ్లడ్ షుగర్ కూడా టెస్ట్ చేయించుకోవాలనుకుంటా'' అంది బజ్జీల్లాగించేస్తూ.

మహాప్రభో! ఈ హైపో కాండ్రియక్ నుంచి నన్ను రక్షించే నాథుడు లేడా! ఆ వరదలోంచి బయట పడ్డానికి చిన్న గడ్డిపోచ లాంటి ప్రయత్నం. ''ఆ సౌమ్య గురించి చెప్తున్నావు కదే? అసలు దాని గురించి నీకెలా తెలుసు?''

బతికాం. ధోరణి మళ్లింది. ''ఎలా తెలుసేవి టీ? నువ్వయితే పాతికేళ్ల క్రితం ఎప్పుడో చూసుంటావు. తను పెళ్లి చేసుకు వెళ్లిపోయాక చూసుండవు. ఈ పేటలోనేగా తన సొంత ఇల్లూ? ఇన్నాళ్లూ కొడుకు చదువనీ ఉద్యోగమనీ ఎక్కడో తిరిగినా, ఇల్లు చూసుకోడానికీ వస్తూండేదిలే అద్దెలు తీసుకోడానికీ దానికీనూ. అందుకని మేం అడపాదడపా కలుసుకుంటూనే వున్నాం.''

''ఇంతకీ దాని కథేవి టీ?''

''ఏవుందీ. వాళ్లాయన పోయి చాలా కాలమయిందిలే. అప్పట్లో ప్రేమ ప్రేమన్చెప్పి ఇంట్లోవాళ్ల కిష్టం లేకుండా చేసుకుందిగా పెళ్లి? కొడుకు చచ్చాక నీతో మాకు సంబంధం లేదన్నార్ట అత్తమామలు. మన మహా తల్లి ఊరుకుంటుందా? వాళ్లం



## పదవులు

''మంత్రులు పదవీ స్వీకారం చేయగానే మరణించిన నాయకుల సమాధుల వద్దకు వెళతారెందుకు?'' అడిగాడు మాష్టారు చంద్రంని.

''మీరు చనిపోయినందువల్లే మాకీ పదవులు వొచ్చా''యని చెప్పుకోవటానికి కావచ్చు సార్.'' చెప్పాడు చందు.

## నటించు

''ఈరోజు మా మేనేజరుగారు భోజనానికి వస్తున్నారు'' చెప్పాడు శేఖర్ భార్య బిందుతో.

''దానికి నేనేం చేయాలి?'' అంది.

''ఈరోజుకు మాత్రం నువ్వు వంట చేస్తు న్నట్టు నటిస్తే చాలు.''

- చందూవంశీ (ప్రొద్దుటూరు)

## ట్రీట్‌మెంట్

''నువ్విచ్చే ట్రీట్‌మెంటుకు మీ ఇంటికొచ్చే చుట్టాలకు రియాక్షనొచ్చి వెంటనే వెళ్లిపోతా రంట కదా! ఆ ట్రీట్‌మెంటు నాకూ నేర్పవూ?'' అడిగాడు కుమార్ తన ఫ్రెండ్ వినయ్‌ను.

''చుట్టాలు మా ఇంటికొచ్చినప్పుడు మాత్రం మా ఆవిడ్నే వంట చెయ్యమంటానుమరి!'' మెల్లగా చెప్పాడు వినయ్.

- తమ్మిశెట్టి భుజంగరావు (పాలకొల్లు)

దర్నీ కోర్టుకీడ్చి మరీ రాబట్టిందిట తనకీ కొడుక్కీ రావాల్సిన ఆస్తి.''

''తప్పేంవుందే?'' అన్నా.

''నువ్వలాగే అంటావులే. ఎప్పుడూ దాని పక్షమే నువ్వు. చెప్పేదేవి టంటే కొడుకు చదువుకీ, ఉద్యోగం సంపాదించడానికీ వున్న-ఆస్తిలో మూడొం తులు ఖర్చయిపోయిందిట. ప్రస్తుతానికి ఆ చిన్న కొంపా, కొడుకు ఉద్యోగమూ ఇవే ఆధారం ఆవిడ గారికి.''


''పోన్లెద్దూ దాని బతుకది బతుకుతోంది'' నా ఉవాచ.

''ఓసి పిచ్చివమాలోకవమా! అదే చెప్తూంట. ఇప్పుడా కొడుక్కేదో జబ్బుట. వైద్యానికి బోలెడు ఖర్చుపెడుతోందిట. ఆమధ్య పెళ్ళి కూడా చేసిం దిలే కొడుక్కి. ఇప్పుడా కోడలు కాపురం ఒదిలేసి పుట్టింటికెళ్ళిపోయిందిట. ఏం దిక్కుమాలిన జబ్బో ఏవిటో! ఇంతకీ చెప్పొచ్చేదేవిటంటే అది ఇప్పుడు కష్టాల్లో ఉంది. పలకరించావా అప్పులిమ్మని కూచుని నీనెత్తిన భస్మాసుర హస్తం పెట్టేస్తుంది. నువ్వసలే మొహమాటప్పీనుగువి. అందుకే వార్నిం గిస్తున్నా. నీకు లౌక్యం తెలీదు. కష్టాల్లో ఉన్నవాళ్ళకి మొహం చాటెయ్యాలి'' ఆఖరి బజ్జీ నోట్లో వేసు కుంటూ సెలవిచ్చింది.

తల తిరిగిపోయింది. మానవతా! నీవెక్కడ? అని అరుద్దామనిపించింది. కాలింగ్ బెల్ డింగ్ డాంగ్ మని రక్షించింది. లేచా. ఆ వెంటనే సత్యావాళ్ళ కారు హారన్ బొయ్ మనడం కూడా వినిపించింది. ''మా ఆయనొచ్చినట్టున్నారే'' అంటూ నావెనకే సత్య కూడా వీధి గుమ్మం దగ్గరకొచ్చింది.

గుమ్మం దగ్గర ఠీవిగా నిలబడుందొక స్త్రీమూర్తి. వివేకంతో ప్రకాశిస్తున్న ముఖం. బొట్టులేని నుదు టిపై చిరు చెమటలు జాబిలి లేని నింగిలో మెరు స్తున్న తారల్లా ఉన్నాయ్. ''సౌమ్య!'' ఆనందంగా అన్నాను.

ఆ క్షణంలో మా మనసు రెండు సగాలుగా విడిపో యింది. పాతికేళ్ళ తరువాత కనపడ్డ మిత్రురాలిపై ఆప్యాయత ఒసగం నిండా. సత్యవాణి ప్రవేశపెట్టిన అనుమానప్పురుగు మరోసగంలో.




గేటు దగ్గరాపిన కార్లోంచి బుర్ర బయటకి పెట్టి, ''వాణిని రమ్మ నండీ. నేను మరోసా రొస్తాలెండి'' అని కేకెట్టాడు సత్యవాణీ వాళ్ళాయన. ''వస్తానే'' అంటూ, సౌమ్యకి కాస్త దూరంగా తప్పుకుంటూ బయటకి నడిచింది సత్య వాణి.

''భయపడకు సత్యా! నేనిన్ను డాక్టర్ని చెయ్య నులే'' అంది సౌమ్య.

ఆనాటి కొంటె నవ్వులు ఇప్పటికీ ఆ పెదాలపై! 'నేన్చెప్పలా! దీనిక్కొంచెం స్క్రూ లూజు' అన్నట్టు వెనక నించి అభినయించి కార్లో దూరి తుర్రుమంది సత్య.

నేను అయోమయంగా చూస్తుంటే, ''అప్పిచ్చు వాడు వైద్యుడుకదా!'' అంది సౌమ్య కళ్ళు చిత్రంగా తిప్పుతూ.

ఫక్కున నవ్వొచ్చింది. ''రావే. కూచో'' అన్నాను. ఆప్యాయత కాసేపు జయించడంవల్ల. ''ఇల్లు బాగుందే. చక్కగా సద్దావ్. మీ గృహప్రవేశంనాడే మా కిటికీలోంచి నిన్ను చూసి గుర్తుపట్టా.''

''అయ్యో పలకరించకపోయావా? నాకప్పుడు తెలీదు నువ్విక్కడే ఉంటున్నట్టు.''

''ఫరవాలేదులే.''

''ఇప్పుడే సత్య చెప్తోంది. నువ్వు ఎదురింట్లోనే ఉంటున్నావని. ఇంతలో నువ్వే ప్రత్యక్షమయ్యావ్.''

''అందుకా నన్ను చూసి ఆశ్చర్యపోకుండా ఆనం దపడ్డావ్?'' అనడిగింది. (అనుమానం కూడా పడ్డానని గ్రహించిందా కొంపతీసి!)

''ఊ.. ఏం చెప్పిందేవిటి సత్య? నా కష్టాలూ, తన రోగాలూ, వాళ్ళాయన ప్రమోషన్లూ, తనకొచ్చిన లూజు మోషన్లూ అన్నీ ఏకరవు పెట్టిందా?''

నవ్వకుండా ఉండలేకపోయా.

''బొత్తిగా హాస్యం తెలీని కమేడియన్ ఎవ్వరైనా ఇప్పుడిక్కడుంటే బాగుణ్ణు'' అంది సౌమ్య.

నా చూపుల్లో మళ్ళీ అయోమయం.

''ఎంత చిన్న పిచ్చి జోకేసినా కిల కిలా నవ్వుతు న్నావ్. యు ఆర్ కమేడియన్స్ డిలైట్'' అంది తనూ నవ్వుతూ.

''ఎందుకో చెప్పనా? నేను మెంటల్లీ రిటార్డెడ్. నా బుర్రకి వయసు చాలా తక్కువ. అందుకే ఈజీగా నవ్వొచ్చేస్తుంది నాకు.'' అన్నా.

నవ్వుతూ దగ్గరకొచ్చి, ఇష్టంగా నా బుగ్గలు సాగదీ సింది. ''నిజమేనే. నీది చిన్నపిల్లల స్వచ్ఛత. అందుకే నువ్వంటే నాకిష్టం.'' అంది.

ఓరి బాబోయ్! బులిపించేసి నెత్తిన చెయ్యెట్టదు కదా!

పరామర్శించకపోతే బాగుండదేమోననిపించి, ''సారీ సౌమ్యా! మీవారి గురించి ఇందాక సత్య చెప్తేనే తెలిసింది'' అన్నా.

ఒక్క నిముషం ఆ ముఖంలో నీలి నీడలు. ''ఏవి టోనే! కొన్ని కొన్ని మన చేతుల్లో ఉండవు. ఏక్సి డెంట్లో ఆయన పోయారు. నేలిలా ఉన్నాను.'' నిట్టూర్చింది.

''మీ అబ్బాయికి ఏదో జబ్బు చేసిందిట కదా?

నిజమేనా?'' అడిగా.

''అవునే. టి.బి.'' అంది.

''అయ్యయ్యో! పాపం!'' అన్నా. నిజంగా చాలా బాధనిపించింది.

''మరీ అంత కంగారేం లేదులే. ఈ రోజుల్లో టీబీకి అంత భయపడక్కర్లేదు. మంచి మందులున్నాయి. బలాన్నిచ్చే తిండీ, మానకుండా మందులూ వాడితే చాలు నయమైపోతుంది'' నిబ్బరంగా చెప్పింది.

''మందులకీ, వైద్యానికీ చాలా ఖర్చవుతుందేమో?'' నాలో పురుగు తలెత్తడం వల్ల అడిగాను.

కాస్త ఆశ్చర్యంగా నాకేసి చూసి, ''నీకు తెలీదా? మావాడు డాక్టరు. వాడికి మందుల ఖర్చేమిటి? అయినా హికెన్ ఎఫోర్డ్. పైగా వాడి కొలీగ్స్ వాడిని పువ్వులా చూసుకుంటున్నాను. వాడికేం భయం లేదు'' అంది.

ఖంగుతిన్నా. కొడుకు డాక్టరా? సత్య చెప్పలేదు.

''అలాగా? అవునూ, నీకోడలు పుట్టింటి కెళ్ళిపోయిందనీ ఏదో చెప్పింది...?'' సణిగేసా. (నాలోనూ ఓ శాడిస్టున్నట్టున్నాడు. ఎలా మాటాడ్తున్నానో!)

సౌమ్య ముఖంలో నవ్వు చెక్కుచెదర్లా. ''వెర్రి పిల్ల! ఆ పిల్ల వయసలాంటిది. పెద్దాళ్ళం అందరం వాడి జబ్బు దాచిపెట్టి పెళ్ళిచేసాం అన్న అనుమానంతో వాళ్ళమ్మ మీద కూడా అలిగింది. వాడికీమధ్య హాస్పిటల్లో తగులుకున్న ఇన్‌ఫెక్షన్ అది. చిన్న అపార్థం. అయినా నా కొడుకేమన్నా బుద్ధావతారం అనుకున్నావా? ఆ అమ్మాయికీ కాస్త ఛేంజ్ ఉంటుందిలే వెళ్ళనీ అని ఊర్కున్నాడు కొన్నాళ్ళు.

ఇంకిప్పుడు ఆపిల్ల చుట్టూ భజన్లు చేస్తూ అలిగితివా సఖీ అంటూ పాడ్డానికి నిన్ననే వెళ్ళాడు. మావాడు ఎంత ఘోరంగా పాడగలడంటే, వాడి పాటల హోరు భరించడంకన్నా అత్తింటి కాపురమే మేలని ఒచ్చేస్తుంది చూడు నాకోడలు రెండ్రోజుల్లో. ఛాలెంజ్! ఎంతెంత పందెం?'' అంది అపరాజిత!

నేనేం మాట్లాడగ్గలను మనసులో జోహార్లర్పించడం తప్ప? శాడిజమ్ స్వస్తి!

''ఊ! ఇంకేమిటి పిల్లా విశేషాలూ? నిత్య సత్య వాణి నీ బుర్రలో దూర్చిన సందేహాలన్నీ తీరాయా?'' (కనిపెట్టేసిందండోయ్! పురుగూ గుడ్‌బై!)

''ఏముంటాయ్? నా నవలల పిచ్చి ఇంకా అప్పట్లాగే ఉంది. చూస్తావా నా కలెక్షన్?'' అన్నా.

''అసలొచ్చిందే అందుకు కదే. పుస్తకాల పిచ్చిలో నా సముఉజ్జీవి నువ్వేనే బాబూ!'' ఇద్దరం అత్యుత్సాహంగా పుస్తకాలు చూస్తూ కబుర్లలో మునిగిపోయాం.

ఎన్ని కబుర్లో! ఎడతెరిపి లేకుండా. సాహిత్యం, జీవితం, రాజకీయాలు, సమాజం మార్తోందా లేక వయసుతో మన దృక్పథం మారుతోందా, స్త్రీవాదం ఇలా.. ఎన్ని టాపిక్సో! తనివితీరా, పాతికేళ్ళుగా మంచి స్నేహం కోసం మనసుపడ్డ పరితాం తీరేలా ఒకటే కబుర్లు. కబుర్లలో టైం తెలీనేలేదు. ఉలిక్కిపడ్డట్టు ఉన్నట్టుండి లేచింది సౌమ్య. ''మా అత్తగారికి మందిచ్చే టైమయింది. వెడతాను. హడావిడిగా బయటకి నడిచింది.

మరి అత్తగారితో తగువందే సత్య? సత్య మాటల్లో సత్యం ఆట్టే లేదని ఇంకా తెలీకపోతే నాఅంత మూర్ఖులు ఇంకెవరూ ఉండరు.

సౌమ్య వెనకే వీధి గుమ్మందాకా నడిచా. మెట్లు దిగుతూ టక్కున ఆగి, ''నాకోసాయం చెయ్యాలి'' అంది. ఊపిరి బిగబట్టా. సత్య మాటలే నిజమా? సాయం పేరుతో నెత్తిన చెయ్యెట్టదు కదా? మళ్ళీ అనుమానం పురుగై బుర్రలో దూరడానికి రెడీ అయింది.

''ఒకటి అప్పివ్వాలి'' అంది సౌమ్య మళ్ళీ. నేమాటాడలా. దాన్నే చెప్పనీ. ''ఓ పాత బట్ట అప్పివ్వవే'' అంది తెచ్చి పెట్టుకున్న దీనత్వంతో కొంటెతనం మిళాయించి.

కోరగా చూసా. ''మరేవిటీ నీ సోమరితనం? ఇల్లంతా అంత అందంగా సర్ది, టీవీ మీద, రేడియోమీద, ఫోను మీద అంత దుమ్ము పేరబెట్టావేం?'' చీవాట్లేసింది.

''ఛీ. ఫో. నాయిల్లూ, నా టీవీ, నాయిష్టం, నా దుమ్మూ. నువ్వెవత్తివే దులపడానికీ?'' కసిరేసా.

''అవున్లే. దులపవలసిన వాళ్ళు దులిపితేనేగానీ వదల్దులే నీ దుమ్ము.'' తిప్పుకుంటూ నిష్క్రమించింది.

నవ్వుకుంటూ తలుపుదగ్గర నిలబడి ఆలోచించా. తనికిలేని రోగాలూ, ఇతరులకి లేని దుర్గుణాలూ ఆపాదించుకుని, ఉన్నంతసేపూ తనకీ నాకూ కూడా మనశ్శాంతి లేకుండా చేసిన సత్యవాణి, - సమస్యుంటే పరిష్కారమూ ఉంటుందన్న భరోసాతో బతికేసేస్తూ, ఉన్నకాసేపూ చీకటిని మింగి వెన్నెల పంచిచ్చిన సౌమ్య వాణి- ఇద్దరూ మనుషులే. స్వభావాలు ఎంత తేడా!

ఒకటి మాత్రం నిజం. ఆ(అ)సత్యవాణులే లేకపోతే ఈ సౌమ్యవాణుల గొప్పదనం గుర్తించడం కష్టం.

★

## పాముల చిన్నోడు!

పశ్చిమ బెంగాల్‌లో గల పైరా దంగా అనే ఊళ్లో 7సంవత్సరాల రాజూరాయ్ అనే బాలుడు వున్నాడు. ఆ వయస్సులో వున్న పిల్లలందరూ అనేక ఆట వస్తువులతో ఆటలు ఆడతారు కదా! అయితే రాజూరాయ్ అనే డింభకుడు మాత్రం రకరకాల పాములతో ఆటలు ఆడి సరదా తీర్చుకొంటూ వుంటాడు. పాములను పట్టడంలో ప్రతిభావంతుడైన తన తండ్రి వద్ద సదరు విద్యను నేర్చుకొన్నాడు. ఎంతటి విషం గల సర్పాన్ని అయినాసరే బహు నైపుణ్యంతో పట్టెయ్యగలడు ఆ చిచ్చర పిడుగు. మనం మెళ్లో మఫ్లర్‌ను చుట్టుకొన్నట్లుగా రాజూరాయ్, పామును చుట్టుకొని చిరునవ్వుతో నడవడం చూసి, జనాలు ఆశ్చర్యపడుతూ వుంటారు.

## అయిదేళ్ల కవయిత్రి

శతరూప బెనర్జీ ఆ పాప పేరు. వయస్సు కేవలం 5సంవత్సరాలు. ఆ బాలిక ఈమధ్య 25పేజీలుగల తాను వ్రాసిన ఓ కవితా సంపుటిని ప్రచురించింది. 'నన్ను ఆకాశాన్ని తాకనివ్వు!' అనే గేయాల పుస్తకం అది. తన రెండు సంవత్సరాల వయస్సు నుంచీ, శతరూప కవితలను కూరుస్తోంది. చిత్రమైన విషయం ఏమంటే, ఆమె అలవోకగా చెప్పే కవితలను తల్లిదండ్రులు కాగితాలపై ఎక్కిస్తున్నారు. అభినందనలు చెప్దామా శతరూపకు!

-కొడిమెల

